

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 97 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 28, ఫిబ్రవరి 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# చరిత్రకారుని చారిత్రాత్మక ఉద్యమం



## మందకృష్ణ ఉద్యమానికి మరపురాని చరిత్ర ఉంది


హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

ఉద్యమకారులకు చరిత్ర ఉంటుందని చరిత్ర రాయగల ఉద్యమాలు చేయడంలో ఎంతో గర్వం దాగి ఉంటుందని డాక్టర్ బరిగెల శివ అన్నారు. పద్మశ్రీ మందకృష్ణ లాంటి మహా ఉద్యమ నేత 30 సంవత్సరాలపాటు ప్రత్యక్ష ఉద్యమాల్లో కొనసాగిన ఉద్యమ నేతగా పేరుగాంచడమే కాకుండా చరిత్రలు సృష్టించే పథకాలలో ప్రత్యక్ష ప్రధాన భూమిక పోషించి ప్రభుత్వాలను మెప్పించి ఉద్యమ చరిత్రకు ఊతమిచ్చారన్నారు. తరాలు మర్చిపోలేని సాహస వంతమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని పుట్టించి, నడిపించి ఉద్యమకారులకు ఆదర్శంగా ఉద్యమాలకు కేంద్ర బిందువుగా నిలిచి ఎస్సి వర్గీకరణను అమలుపరచుకొని లోపాలను సవరించుకొనే వరకు నిజాయితీతో నిలబడుతూ తన ఉద్యమ నేపథ్యాన్ని మహామహులే చర్చించుకునే విధంగా చరిత్రలు సృష్టించారన్నారు. ఎస్సీ వర్గీకరణ సంపూర్తిగా పూర్తవగానే తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల హక్కుల పరి రక్షణ కోసం గతంలో ఎంతగానో ప్రయాసపడి కొట్లాడిన మందకృష్ణ మాదిగ దివ్యాంగుల సంక్షేమం అమలు కొరకు నేరుగా రంగంలోకి దిగి మరో ఉద్యమం ప్రారంభించబోతు న్నారని బహిరంగంగా తెలిపారు. ఉద్యమ ప్రారంభం.... ఉద్యమ ముగింపు.... ఎంతటి కష్టతరమైన మందకృష్ణ లాంటి ఉద్యమ నేత పోరాటాలతో అసాధ్యమైనవన్నీ.....

- మిగతా 3లో..

బహుజన వర్గాల మేలుకొరకు
ఎన్నో ఉద్యమాలు తలపెట్టారు
ఎస్సీ వర్గీకరణ చిరకాల లక్ష్యం నెరవేర్పులో
ప్రధాన పాత్ర పోషించారు
ప్రభుత్వాలను మెప్పించి ఆదర్శవంతమైన
పథకాలను తెప్పించారు
తెలుగు రాష్ట్రాల్లో చిన్నపిల్లల గుండె జబ్బులకు
ఆదర్శ మార్గం వేశారు
ఉద్యోగుల హక్కుల కోసం పోరాడారు
పదోన్నతులు,అధికార పదవులు
మందకృష్ణ పోరాటం ఫలితాలే
రాష్ట్ర రాజకీయాల్లో ఉద్యమ
కేంద్ర బిందువు ముమ్మాటికి మందకృష్ణ
నాలుగు పదుల ఉద్యమ చరిత్రకు
ఊహకందని ఫలితాలు వచ్చాయి
సక్సెస్ ఉద్యమానికి సరిపడే నాయకుడు
పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**డాక్టర్ బరిగెల శివ**







డాక్టర్ బరిగెల శివ, జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులు ముఖ్యమంత్రి భేటీ





వివరాలు 5లో

## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

**ఆరు స్థానాలకు ఉదయం పోలింగ్ ప్రారంభం**
**3న కౌంటింగ్...ఫలితాల ప్రకటన**

హైదరాబాద్/విజయవాడ,ఫిబ్రవరి27(జై భీమ్ న్యూస్) :

తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణల్లో మూడు చొప్పున 6 స్థానాల్లో గురువారం ఉదయం ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ఏపీలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 16 జిల్లాల పరిధిలోని 1,062 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 70 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 6,84,593 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రం లోపల క్యూలైన్లో ఉన్నవారందరికీ ఓటేసే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానంలో 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్), గాదె శ్రీనివాసులునాయుడు (పీఆర్టీయూ), విజయగౌరి (యూటీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ప్రధానంగా రాజశేఖరం (కూటమి) రాఘవులు (పీడీఎఫ్) మధ్య పోటీ ఏర్పడింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బరిలో 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో ఆలపాటి రాజేంద ప్రసాద్ (కూటమి) కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. తెలంగాణలో ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం తోపాటు ఉపాధ్యాయ నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గాలకు కలిపి 90 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మూడు స్థానాల్లో ఓటింగ్ కోసం 973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



# సంపాదకీయం

## విద్వేష ప్రసంగాలతో విషప్రచారం

కుల, మత తేడాలకతీతంగా స్నేహం, సౌభ్రాతృత్వం విరాజిల్లిన నేల భారతదేశం. అయితే పాలక పార్టీ బిజెపి ద్వేషపూరిత ప్రసంగాలు ఈ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ దేశ వాతావరణాన్ని విషతుల్యంగా మారుస్తున్నాయి. ఇండియా హేట్ ల్యాబ్ (ఐహెచ్ఎల్) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2024లో ఈ ధోరణి మరింత విస్తరించింది. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికలు, ఆపై మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నాయకుల ద్వేషపూరిత ప్రసంగాలు విస్తరించాయి. ఈ నివేదిక కేవలం సంఖ్యలను మాత్రమే వెల్లడించకుండా, ఈ ప్రసంగాల వెనుక ఉన్న వ్యూహాలను, కీలక పాత్రధారులను, వాటి సైద్ధాంతిక ప్రేరణలను కూడా బహిర్గతం చేసింది. 2024 నివేదిక ప్రకారం, ద్వేష ప్రచారంలో బిజెపి, దాని అనుబంధ సంస్థలు ప్రత్యక్షంగా ముడిపడ్డాయి. గత ఎన్నికల్లో ఫ్రింజ్ సంఘాలు మాత్రమే విద్వేష ప్రసంగాలు చేసేవి. కానీ ఈసారి రాష్ట్ర, కేంద్ర స్థాయి నాయకులు స్వయంగా ఈ విష ప్రచారాన్ని నడిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన ద్వేషపూరిత ప్రసంగాలను దేశమంతా గమనించింది. దీనివల్ల బిజెపి దేశంలోనే అతి పెద్ద విద్వేష ప్రసంగం ప్రచారకారులుగా మారింది. బిజెపి నాయకులు హాజరైన 340 సమావేశాల్లో 29.2 శాతం విద్వేష ప్రసంగాలు జరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఇది గతేడాదితో పోలిస్తే పెరిగింది. అయినప్పటికీ, బిజెపి కేవలం 50 సంఘటనలకే బాధ్యత వహించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో బిజెపి చేసిన ద్వేష ప్రసంగాలు మొత్తం 76.7 శాతంగా నమోదు అయ్యాయి. కేవలం బిజెపి మాత్రమేకాదు, విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి), బజరంగ్ దళ్ వంటి హిందూత్వ సంస్థలు కూడా విద్వేష ప్రచారాన్ని మరింత పెంచాయి. వీరు పాల్గొన్న 279 కార్యక్రమాల్లో ద్వేషప్రసంగాలు చోటుచేసుకున్నాయి. మహారాష్ట్రలోని సకల్ హిందూ సమాజ్ 56 ద్వేష ప్రసంగాలను నిర్వహించింది. సురేష్ చవాంకే, కాజల్ హిందుస్తానీ, బిజెపి ఎంఎల్ఎ టి. రాజాసింగ్, నితీష్ రాణే వంటి మతతత్వవాదులు ఈ ప్రచారంలో కీలకంగా వ్యవహరించారు. 2024 ఏప్రిల్ 21న రాజస్థాన్ బన్స్వారాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ముస్లింలను చొరబాటుదారులుగా అభివర్ణిస్తూ, వారు హిందువుల సంపదను దోచుకుంటున్నారని ప్రధాని మోడీ చేసిన ప్రసంగం తీవ్ర ప్రభావం చూపించింది. ఎన్నికల సమయంలో మొత్తం 373 ద్వేషపూరిత ప్రసంగాల ఘటనలు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలు దీని వల్ల అత్యధికంగా ప్రభావితమయ్యాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక్కరే 58 ద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. 'ఓట్ జిహాద్', 'ల్యాండ్ జిహాద్' వంటి భయపెట్టే పదాలను పదేపదే ప్రస్తావించారు. యోగి ఆదిత్యనాథ్ 86 ద్వేష ప్రసంగాలు చేశారు. అంటే ప్రతి నాలుగు రోజులకు ఒకటి చొప్పున విద్వేష ప్రచారం జరిగింది. ఈ ప్రసంగాల్లో ప్రధానంగా ముస్లింలు, క్రైస్తవులు లక్ష్యంగా మారారు. బిజెపి ఎన్నికల వ్యూహం పూర్తిగా మత భయాన్ని రెచ్చగొట్టడంపైనే ఆధారపడింది. ప్రధాని మోడీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ లాంటి నాయకులు 'హిందువుల ఆస్తులను బంగ్లాదేశ్ చొరబాటుదారులకు, రోహింగ్యా శరణార్థులకు విరాళంగా ఇస్తారు' అంటూ ప్రతిపక్షాలను దుష్ప్రచారం చేశారు. ఈ ప్రసంగాల ప్రభావంగా మత అల్లర్లు, మూకదాడులు, వ్యవస్థాగత వివక్ష పెరిగాయి. 2024లో ద్వేష ప్రసంగాలు కేవలం బహిరంగ సభలకే పరిమితం కాలేదు. సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా వ్యాప్తి చెందాయి. కొన్ని సెకన్ల వ్యవధిలోనే లక్షలాది మందికి చేరాయి. ఐహెచ్ఎల్ నివేదిక ప్రకారం, 995 ద్వేషపూరిత వీడియోలు ఫేస్‌బుక్, యూ ట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ట్రాక్ చేయబడ్డాయి. ఒక్క ఫేస్‌బుక్‌లోనే 495 వీడియోలు హోస్ట్ చేయబడ్డాయి. 211 వీడియోలు యూట్యూబ్‌లో కనిపించాయి. బిజెపి నాయకుల 266 మైనారిటీ వ్యతిరేక ద్వేష ప్రసంగాలు బహుళ వేదికలలో ప్రత్యక్ష ప్రసారం అయ్యాయి. మొత్తం 1,165 ద్వేష ప్రసంగాల ఘటనల్లో 1,147 ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నట్లు నివేదిక పేర్కొంది. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి యోగి, ఇతర బిజెపి నాయకులు ద్వేషపూరిత కథనాలను ఎన్నికల ప్రచారంలో ప్రోత్సహించారు. ముస్లింలపై ప్రత్యక్ష హింసకు పిలుపునిచ్చిన 259 ప్రసంగాలు నమోదయ్యాయి. ముస్లిం వ్యాపారాలను బహిష్కరించాలని కోరుతూ 111 ప్రసంగాలు, మసీదులు, ముస్లిం ఇళ్లను ధ్వంసం చేయాలని కోరుతూ 274 ప్రసంగాలు, ముస్లింలపై ఆయుధాలు పట్టుకోవాలని కోరుతూ 123 ప్రసంగాలు జరిగాయని నివేదిక వెల్లడించింది. ఉత్తరాఖండ్‌లో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమంలో ఒక వక్త 'హిందువులు కాని వారిని చంపడం మోక్షానికి దారి తీస్తుంది' అని బహిరంగంగా ప్రకటించాడు. గతేడాది ద్వేష ప్రసంగాలు ముస్లింలను మాత్రమే లక్ష్యం గా చేయలేదు. క్రైస్తవ వ్యతిరేకత కూడా పెరిగింది. 115 ద్వేష ప్రసంగాలు క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్నవిగా నమోదు అయ్యాయి. 2024 మార్చిలో అసోంలోని హిందూ జాతీయవాద సంస్థలు క్రైస్తవ పాఠశాలలపై దాడులకు పిలుపునిచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రీయ బజరంగ్ దళ్ నాయకులు కాథలిక్ పాఠశాలలపై దాడులు చేయాలని కోరారు. ఈ ద్వేష ప్రచారాల ప్రభావంగా మూకదాడులు, బలవంతపు పునఃమార్పిడి ఘటనలు పెరిగాయి. ఇండియా హేట్ ల్యాబ్ 2024 నివేదిక ఓ భయంకరమైన వాస్తవాన్ని వెల్లడిస్తోంది. ద్వేష ప్రసంగాలు ఉద్దేశపూర్వక రాజకీయ ప్రాజెక్టుగా మారాయి. ముస్లింలను, క్రైస్తవులను అణగదొక్కేందుకు, భారత ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేందుకు రూపొందించబడ్డాయి. ఈ ద్వేష ప్రచారం ప్రభావాలు రాబోయే సంవత్సరాల్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది.

## ఢిల్లీ విమానాశ్రయంలో భారీగా గంజాయి, బంగారం పట్టివేత

ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీగా గంజాయి, బంగారాన్ని పట్టుకున్నారు. థాయిలాండ్‌కు చెందిన ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. టాలీ బ్యాగ్‌లలో బట్టలకు బదులు గంజాయిని 54 ప్యాకెట్లుగా ప్యాకింగ్ దుబారు నుండి ఢిల్లీకి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే, కస్టమ్స్ అధికారులు నిర్వహించిన స్క్రీనింగ్ సమయంలో పట్టుబడ్డారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసిన అధికారులు, ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం స్మగ్లింగ్ ప్రయత్నం విఫలమైంది. కస్టమ్స్ అధికారులు 172 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బంగారాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి ఖర్జూరం పండ్లలో కలిపివేసి తరలించేందుకు ప్రయత్నించి దొరికిపోయాడు. స్మగ్లర్‌ను అధికారులు అదుపులోకి తీసుకుని, కస్టమ్స్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# పలు ప్రత్యేకతల సమాహారం

### మొరార్జీ దేశాయ్ జీవితం

పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్ప నాయకునికి అలాంటి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం. మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించి నందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్ను మూశారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964 మరియు 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు. అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే – ఎ – పాకిస్తాన్ – 1986 లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భదేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్ లో సివిల్ సర్వీసులో చేరారు. 1927–28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, అతను బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు. 1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. ధృఢమైన గంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల – వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయ వాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979 లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ చురుకైన రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు.

# భారతీయతకు నిలువెత్తు నిదర్శనం సివిరామన్

వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు. పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించారు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28-02-1928న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్న దినాన్ని (నేషనల్ సైన్స్ డేజాతీయ విజ్ఞాన దినోత్సవము) గా భారతదేశంలో ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తుల్లో సర్ సీవి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నం లోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాస్కై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు. మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ ధైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్, ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాధ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్సులో, పారిశ్రామిక రంగంలోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రో స్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించాడు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది. విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు.

# ట్రంప్ ప్రతిపాదనకు పుతిన్ ఆమోదం

అమెరికా ప్రపంచ వ్యవహారాలలో ఒక కీలకమైన నిర్ణయాన్ని తీసుకుంది, ఎందుకంటే ప్రస్తుత కాలంలో సైనిక ఖర్చులు పెరుగుతున్నాయి, ముఖ్యంగా కొనసాగుతున్న యుద్ధాల కారణంగా. ఉక్రెయిన్‌యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, రష్యా తన రక్షణ బడ్జెట్‌ను అనూహ్యంగా పెంచింది. ఇదే సమయంలో, యుక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే దేశాలు, ముఖ్యంగా యుఎస్, కూడా పెద్ద మొత్తంలో సైనిక ఖర్చులను కేటాయించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, యుఎస్ అనేక దేశాల దృష్టిని ఆకర్షించిన ఒక ప్రతిపాదనను ఉత్పృంగించింది. యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా, చైనా దేశాలు తమ రక్షణ ఖర్చులను 50% తగ్గించాలని సూచించారు. ఈ ప్రతిపాదనకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాజిటివ్ స్పందన వ్యక్తం చేసారు, అయితే చైనా దీనిని తిరస్కరించింది. పుతిన్ ట్రంప్ ప్రతిపాదనను స్వీకరించడం వలన, యుఎస్, రష్యా మధ్య సంబంధాలు మెరుగుపడతాయన్న ఆశలు పుట్టాయి, ఎందుకంటే ఈ రెండు దేశాలు గతంలో శీతల యుద్ధంలో కలిసిపోయినవిగా పరిగణించబడ్డాయి. పుతిన్ ఈ ప్రతిపాదనను "మంచి ఆలోచన" అని వర్ణించగా, మాస్కో దీనిపై చర్చలు జరపడానికి సిద్ధంగా ఉందని ప్రకటించాడు. పుతిన్ ఈ ప్రతిపాదనపై ప్రసారం జరిగిన ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడతూ, "యుఎస్ తన రక్షణ బడ్జెట్‌ను 50% తగ్గిస్తే, మేమూ అదే శాతం తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నాం. చైనా ఈ విషయంపై చేరితే, ఒక ఒప్పందం సాధ్యం అవుతుంది" అని అన్నారు. అయితే, చైనా తరపున మాట్లాడటం లేదని ఆయన స్పష్టం చేసారు, కానీ రష్యా చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. పుతిన్ ఈ ప్రతిపాదనను ఆమోదించడం ఉక్రెయిన్‌యుద్ధానికి ఒక పరిష్కారం దిశగా ప్రగతి వచ్చే అవకాశాలను సూచిస్తోంది. అయితే, చైనా అధ్యక్షుడు శి జిన్పింగ్, అనేక భూభాగ వివాదాలలో జడవడిని ఎదుర్కొంటున్న చైనా, యుఎస్ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వడం లేదు.

# చరిత్రకారుని చారిత్రాత్మక ఉద్యమం





మొదటి పేజీ తరువాయి

సాధ్యమయ్యే విధంగా చరిత్రలు నిర్మించుకోవడం ఉద్యమకారుని లక్ష్యంగా భావిస్తూ ముందుకు నడుస్తూ నడిపిస్తున్న తీరు చరిత్ర కలిగిన ఉద్యమకారులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పార్టీల అణిచివేత ప్రభుత్వాల వేధింపులు అక్రమ కేసుల నిర్బంధాలు నమ్మిన వాళ్లు మోసం చేయడం పక్కలో బల్లెపు పోటుల్లా వేదనలు కలిగి అనుభవించినప్పటికి తన ఉద్యమ స్ఫూర్తి ఎక్కడ తగ్గలేదు తన ఉద్యమ ఫలితాలు ఎక్కడ తారుమారు కాలేదు అనడానికి ఎస్సీ వర్గీకరణ అమలు పరచడమే గొప్పదనంగా చెప్పుకోవాలన్నారు.

## మంద కృష్ణ మాదిగ - ట్రాక్ రికార్డ్..

**ఇండియాలో 100శాతం సక్సెస్ రేట్ ఉన్న ఒకే ఒక్క ప్రజా ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగ**

**మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో సాధించిన విజయాలు,ఫలితాలు...**

**1) ఎస్సీ వర్గీకరణ,సక్సెస్**

**2)ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్,సక్సెస్**

**3) హృద్రోగ చిన్నారుల ఉచిత ఆపరేషన్,సక్సెస్**

**4) ఆరోగ్యశ్రీ,సక్సెస్..**

**5) వికలాంగుల పెన్షన్లు,సక్సెస్**

**6) వృద్ధులు,వితంతువుల పెన్షన్లు సక్సెస్**

**7)రేషన్ కోటా బియ్యం పెంపు సక్సెస్**

**8) తెలంగాణ అమరుల కుటుంబాల సంక్షేమం,సక్సెస్**

**9) ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్ట పరిరక్షణ,సక్సెస్**

**10) అత్యాచారాల నిరోధక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు,సక్సెస్**

**ఈ పది అరుదైన అద్భుతమైన ఉద్యమ ఘట్టాల తన ఒంటరి పోరాట ఉద్యమాలతో సాధించారు.**

## ఫలితాలు- లబ్దిదారులు

*1) ఎస్సీ వర్గీకరణ సాధించడం వల్ల 25 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి,లక్ష మంది విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలు లభించాయి.*

*2) ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ లు సాధించడం వల్ల వేలాది మంది దళిత గిరిజన ఉద్యోగస్తులు తమ శాఖల్లో పదోన్నతులు పొంది ఉన్నత స్థాయికి ఎదిగారు.*

*3)గుండె జబ్బుల చిన్నారుల పోరాటం ద్వారా ప్రభుత్వం ద్వారా 4) లక్షల మంది చిన్నారులకు ఉచిత ఆపరేషన్ లు జరిగాయి.రెండు లక్షల మంది చిన్నారుల ప్రాణాలు నిలబడ్డాయి....*

*5) ఆరోగ్యశ్రీ ద్వారా 9 కోట్ల మంది నిరుపేద తెలుగు ప్రజలకు లబ్ది చేకూరుతుంది.కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా పొందడంతో పాటు ప్రాణాలు కాపాడుకొని ఆరోగ్య భద్రతను పొందుతున్నారు.*

*6) వికలాంగుల పెన్షన్ ల సాధించడం ద్వారా తెలంగాణలో లక్షల ఆంధ్ర ప్రదేశ్ లో 12 లక్షల మంది వికలాంగులకు లబ్ది చేకూరింది*

*7) దాదాపూ 20 లక్షల మంది ఆత్మగౌరవంతో పెన్షన్ పొందుతూ గౌరవంగా జీవించే ఉన్నత స్థితి కలిగింది*

*8) వృద్ధులు,వితంతువుల పెన్షన్ ల ద్వారా తెలంగాణలో 30 లక్షల మందికి,ఆంధ్రప్రదేశ్ లో సుమారుగా 40 లక్షల మంది మొత్తం70 లక్షల మంది వృద్ధులు,వితంతువులు పెరిగిన పెన్షన్లు అందుకొని లబ్ది పొందారు..ఇతరుల మీద అధారపడకుండా గౌరవంతో జీవిస్తున్నారు.*

*9) తెల్ల రేషన్ కార్డు ద్వారా బియ్యం కోటా పెరగడం వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 3 కోట్ల 38 లక్షల నిరుపేద కుటుంబాలకు లబ్ది చేకూరింది..పేద వాడికి కడుపు నిండా మెతుకుకు ఉపయోగపడింది.*

*10) తెలంగాణ అమరుల కుటుంబాల సంక్షేమం కోసం జరిగిన పోరాటం వల్ల సుమారు 500 కుటుంబాలకు లబ్ది చేకూరింది..దాని వల్ల కుటుంబానికి 10 లక్షల డబ్బుతో పాటు ఒకరికి ఉద్యోగం, మూడు ఎకరాల భూమి లభించింది.అమరుల త్యాగం వృథాగా పోలేదు,ఎవరి మీద ఆధారపడకుండా వారి కుటుంబాలు గౌరవంగా జీవించే స్థితి కలిగింది.*

*11) ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించడం వల్ల దేశ వ్యాప్తంగా కోట్లాది మంది దళిత గిరిజన ప్రజలు సాంఘిక భద్రతను పొందుతున్నారు.అగ్రకుల అహంకార శక్తుల నుండి రక్షణ కోసం పురుడుపోసుకున్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కొన్ని కుట్రల జరిగి ప్రమాదంలో పడితే జాతీయ స్థాయిలో ఉద్యమం చేసి పరిరక్షించడం జరిగింది.*

*12) తెలంగాణ రాష్ట్రంలో మహిళల మీద జరుగుతున్న హత్యలు అత్యాచారాలను నిరోధించడానికి పోరాటం చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన ఫలితంగా 36 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పడ్డాయి.దాని వల్ల హత్యలకు అత్యాచారాలు గురైన వందలాది మంది మహిళలకు న్యాయం జరిగింది.దోషులకు శిక్షలు పడ్డాయి.మహిళలకు సాంఘిక భద్రత కలిగింది.*

ఇరవై ఏళ్ల క్రితం రద్దు కాబడిన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తిరిగి డిల్లి స్థాయిలో పోరాడి మళ్ళీ సాధించడం జరిగింది.దాని ఫలాలు వంద తరాలకు అందబోతున్నాయి.

ఇలా చెప్పుకుంటే అనేక పోరాటాలు,అనేక ఫలితాలు ఉన్నాయి.అందులో ప్రధాన ఘట్టాలను మాత్రమే పైన పేర్కొనబడినవి.గత ముప్పై ఏళ్ల కాలంలో ఎంచుకున్న అంశం మీద నిర్ణయం తీసుకొని,దాని సాధనకు కార్యాచరణ చేపట్టి ,ఉద్యమ నిర్మాణంతో పోరాటం చేసి ప్రతి డిమాండ్ ను సాధించిన చరిత్ర మంద కృష్ణ మాదిగది...

మంద కృష్ణ మాదిగ ఒక్కసారి టార్గెట్ పెట్టుకున్నాడంటే సాధించదాక వదిలిపెట్టలేదు.. అందుకే ఇండియాలో వంద శాతం సక్సెస్ రేట్ ఉన్న ఒకే ఒక్క ఉద్యమ నాయకుడు మంద కృష్ణ మాదిగ.. మంద కృష్ణ మాదిగ చేతిలో అధికారం లేదు,పదవీ లేదు,కానీ కేవలం ఉద్యమ శక్తితోనే కోట్లాది మంది ప్రజలకు లబ్ది చేకూర్చాడు. కులంతో,మతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన చరిత్ర మంద కృష్ణ మాదిగ నాయకత్వానిది..నేటి ఆధునిక భారతదేశంలో ఉద్యమ శక్తితో పోరాట పటిమతో ఎన్నో విజయాలు సాధించి,వాటి ఫలాలు కోట్లాది ప్రజలకు అందించిన ఒకే ఒక్క నాయకుడు మంద కృష్ణ మాదిగ మాత్రమే..... ఇలాంటి చరిత్రకు పద్మశ్రీ ఒక ఉపశమనం మాత్రమే.... ఈ చరితకు,ఈ ఘనతకు దక్కాల్సింది,చెందాల్సింది ఎంతో ఉంది...... ప్రజలు ఆ నిర్మాణానికి పునాదులుగా నిలుస్తారని ఆశిస్తున్నాం...














## బెంగాల్లో దొంగ ఓట్లను చేర్పించిన బిజెపి

**ఇసి సహకారంతో నకిలీ ఓటర్లను చేర్పించారు**

**వీటిని తొలగించకుంటే..ఇసి ముందు ధర్నా చేస్తాం**

**బెంగాల్ సిఎం మమతా బెనర్జీ హెచ్చరిక**



**కోల్‌కతా,ఫిబ్రవరి27(జై భీమ్ న్యూస్):**

పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని దుయ్యబట్టారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన దీదీ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా భాజపా ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హరియాణా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దిల్లీ, మహారాష్ట్రల్లోనూ భాజపా ఈ తరహా వ్యూహాలను అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని భాజపాకు తెలుసునని, అందుకే తప్పుడు జాబితాను రూపొందించే పనిలో పడిందన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (భాజపా) బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

## వాలీబాల్ టోర్నమెంట్ క్రీడల ప్రోత్సాహం



**చౌటుప్పల్‌బీ(జైభీమ్ న్యూస్)**

మహాశివరాత్రి సందర్భంగా తంగడపల్లి ఆధ్వర్యంలో గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది.మొదటి బహుమతిగా గెలుపొందిన వారు ఆర్ స్ ఫాలోవర్స్ వారికి రూపాయలు 11,111/- పెద్దిగారి విగ్నేష్ ద్వితీయ బహుమతి గెలుపొందిన స్వామి వివేకానంద యూత్ వారికి 5,555/-పోలోజు అనిల్ షీల్డ్ కప్స్ అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కు సహకరించిన దాతలు కొయ్యడ శేఖర్ గౌడ్ , గట్టు మొగులయ్య,కంచర్ల సాయిలు,బొల్లమోని శ్రీకాంత్ , వర్గాల శ్రీకాంత్ వాలీబాల్ క్రీడాకారులు బొల్లమోని గణేష్ అన్నమోని వినయ్గట్టు సాయి,గంగాపురం ప్రవీణ్, గట్టు సందీప్ గట్టు భాను పోలోజు శ్రవణ్, సిలివేరు చంద్రకాంత్0రవి,శివ, శ్రీనివాస్,భాను తదితరులు పాల్గొన్నారు.

## కేరళ రాష్ట్ర యువతి యువకులతో వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

నెహ్రూ యువ కేంద్ర వరంగల్ అద్వర్యంలో నిర్వహించ బడుతున్న 5 రోజుల అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనంలో భాగంగా కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన 27 మంది యువతి యువకులు కాకతీయ విశ్వవిద్యాలయం ను సందర్శించి, విశ్వవిద్యాలయం చాల గొప్పది అని, నిర్వహిస్తున్న కోర్సు, వసతులు, విద్యార్థులకు ఉన్న అవకాశాల గురంచి తెలుసుకున్నారు, తెలంగాణా రాష్ట్రనికి అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనంలో భాగం వచ్చిన యువతి యువకులు వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డిని, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంను కలిసి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతల, హాస్టల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.పి.రాజ్ కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహిత డాక్టర్ అకులపల్లి మధు తదితరలు పాల్గొన్నారు.



# మైనార్టీల జీవితాల్లో వెలుగులు





**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

బీఎంఆర్పిఎఫ్ ఆవిర్భావ సభలో పద్మ శ్రీ మంద కృష్ణమాదిగ దేశంలో మైనార్టీల జీవితాల్లో వెలుగులు నిండాలి అంటే పేదరికం పోవాలని మైనార్టీలు దయ నీయస్థితిలో ఉండటానికి కారకులు ఎవరో గుర్తించి వాస్తవాలు గ్రహించడం ద్వారా భవిష్యత్ లో చైతన్యం చాటాలని పద్మశ్రీ మంద కృష్ణమాదిగ మైనార్టీలకు పిలుపు నిచ్చారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ వేదిక గా జరగిన బీఎంఆర్పిఎఫ్ ఆవిర్భావ సభలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు మత విద్వేషాలు వైషమ్యాలు రెచ్చ గొట్టే వాళ్ళ ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని భారత పౌరులుగా సమైక్యతకు పాటుపడుతున్న ముస్లిం లను కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేస్తు న్నాయని రాజకీయ భాగస్వామ్యం ఇవ్వడం లేదని అన్నారు. ప్రతీ కారం పెంచు కోవడం ద్వారా సాధించేది శూన్యం అని అదే పరివర్తనకు ప్రయత్నిస్తే ఏదైనా సాధించ వచ్చని అన్నారు. మైనార్టీల కు విద్య,ఉద్యోగం, రంగం తో పాటు రాజకీయ రంగంలో రిజర్వేషన్ల కోటా పెంచాలన్నారు జీవన ప్రమాణాల్లో మెరుగుదలకోసం మైనార్టీలకు ప్రభుత్వాల నుంచి తోడ్పాటు ఇవ్వాలని కోరారు ఇప్పటికైనా ముస్లిం మైనార్టీలు తమ స్వంత త్ర ఎజెండా తో వెళ్లాలన్నారు. భవిష్యత్తులో దళిత,బహుజనులతో పాటు మైనార్టీ ఐక్య ఉద్యమాలు చేసి హక్కులు సాధించుకుందాం అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎంఆర్పిఎఫ్ వ్యవస్థాపకులు సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సచార్ కమిట్ నివేదికను అమలు చేయాలని,స్థానిక ఎన్నికల్లో మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు,మైనార్టీ లు పేదరికం లో ఉండటానికి కారణమైన పార్టీలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాలిక్,ప్రొఫెసర్,అన్వర్,అలీం,సయ్యద్ ఆసిఫ్ హుస్సేన్, సినీ సంగీత దర్శకులు ఎస్ ఏ ఖుద్దూస్,యూసఫ్ బాబా,శహీన్, వసీం,వాహెబ్,గబ్బార్ ,ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులుగా డాక్టర్ మంథని శంకరయ్య

**14 సంవత్సరాలుగా తెలుగు బోధనలో**

**పరిపూర్ణజ్ఞానవంతులు డాక్టర్ శంకరయ్య**


**తన రచనలతో సమాజాన్ని ప్రభావితం చేస్తున్నారు**

**పుస్తక రచయితగా అపార అనుభవం కలిగిన అధ్యాపకులు**

**డాక్టర్ శంకరయ్యను అభినందించిన ఆచార్య అధ్యాపక బోధనేతర సిబ్బంది**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

నేటి తెలుగు సాహిత్యానికి కవి కళాదుల్లో విలువైన పరిజ్ఞానంతో పుస్తక రచయితగా ఎదుగుతున్న డాక్టర్ మంథని శంకరయ్య తెలుగు విభాగ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులుగా నియమించబడడం అతి విలువైన అంశంగా పరిగణించబడుతూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రవేశపెడుతున్న నూతన పాఠ్య ప్రణాళికలను సిద్ధపరచడంలో డాక్టర్ శంకరయ్య విభాగానికి మేలు చేకూర్చడమే కాకుండా నియమాలకు లోబడి పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేయగలరనే నమ్మకంతో కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డా.మంథని శంకరయ్య ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య రాంచంద్రం గురువారం ఉత్తర్వులు జారీ చేసాడు. డా.మంథని శంకరయ్య పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఏక్లాస్పూర్ గ్రామంలో నిరుపేద మాదిగ కుటుంబంలోని వెంకటరాజం గట్టమ్మ దంపతులకు పంచమ సంతానంగా జన్మించారు. మాదిగ వృత్తి చేసి జీవించిన తండ్రి ఎన్నడు శంకరయ్య ను ఆవృత్తి వైపు తీసుకెళ్ళలేదు.కష్ట పడి చదివించారు.సైన్స్ నుండి సాహిత్యానికి వచ్చి ఎంఏ తెలుగు కేయూ తెలుగు విభాగంలో చదివి ఇక్కడే ఆచార్య బన్న అయిలయ్య పర్యవేక్షణలో "శిఖామణి సాహిత్యం-సమగ్రపరిశీలన "అనే అంశంపై పిహెచ్. డి.పట్టాపొందాడు.అంబేద్కర్ అడుగు జాడల్లో నడుస్తూ దళిత కవిగా "తునకలకందని దండెం "నల్ల రక్తకణాలు "యుద్ధం-తపస్సు "కవిత్వాన్ని వెలువరించారు. "చిగురు"పత్రావళి "వ్యాస సంపుటలు ప్రచురించారు. తన గురువు బన్నయయిలయ్య పై "బన్నగురుశతకం"వెలువరించాడు.ఆచార్య టి.మనోహర్ కి అంకితమిచ్చిన "జక్కులు "నవల కు కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం లభించింది. ఇలా సాహిత్యం లో వివిధ ప్రక్రియల్లో ప్రావీణ్యం కల్గి ఎంతో ఖ్యాతి గడించాడు.ఎంఏ.తెలుగు విద్యార్థులకు దళిత సాహిత్యం ',ఆధునిక సాహిత్యంబీప్రాచీన సాహిత్యంబీసంస్కృతం బీప్రబంధంబీమొదలగు పాఠ్యాంశాలు బోధించాడు. నాలుగు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నాడు. దూరవిద్య, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లలో పి.జి పాఠ్యాంశాలు రాసాడు. 11అంతర్జాతీయ సెమినార్లు 60కిపైగా జాతీయ సెమినార్లకు పత్ర సమర్పణ చేసాడు.నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులకు అత్యంత చేరువగా ఉంటూ ఎల్లవేళలా సాహిత్య వ్యాసంగం కొనసాగిస్తూ తెలుగు విభాగంలోని సీనియర్ల ప్రొఫెసర్లతో మన్ననలు పొందుతూ, తెలుగు శాఖకు పూర్వవైభవం తీసుకొస్తాడని మిత్రులు అధ్యాపకులు పరిశోధకులు భావిస్త.



## యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో వసతులను మెరుగుపరచాలి

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**


పీడీఎస్యు కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం గురువారం కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో రిజిస్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పిడిఎస్యు అధ్యక్ష కార్యదర్శులు విజయ్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో గల ఆరోగ్య కేంద్రం అనేక సమస్యలలో చిక్కుకొని ఉంది. ఆరోగ్య కేంద్రంలో కనీసం విద్యార్థులకు మందులు అందుబాటులో లేవు మెడికల్ ఆఫీసర్లు లేక విద్యార్థులు మెరుగైన వైద్యం హెల్త్ సెంటర్ నుండి పొందడం లేదు. టెక్నీషియన్లు లేక మెడికల్ పరికరాలు పాడవుతున్నాయి తక్షణమే యూనివర్సిటీ అధికారులు ఆరోగ్య కేంద్రం పైన దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని 24 గంటలు ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందుబాటులో విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు జరిగింది. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు యూనివర్సిటీ నాయకులు సురేందర్ సురేందర్, దీక్షిత్, అజయ్, రాహుల్ ,రోహిత్, సూర్య , మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## బెల్గాంలోని మరాఠీ దుండగులను శాశ్వతంగా బహిష్కరించండి

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెల్గాం జిల్లాలో కన్నడ మాట్లాడినందుకు బస్ కండక్టర్ పై మరాఠీ దుండగులు చేసిన దౌర్జన్యాలను ఏ నాగరిక సమాజం సహించదు. పునరావృతమయ్యే ఈ మరాఠీ దుండగులను గుర్తించి, వారిని శాశ్వతంగా రాష్ట్రం నుండి బహిష్కరించేలా వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలి అని కర్ణాటక ముఖ్యమంత్రి కి ఆప్ అధ్యక్షుడు చంద్రు లేఖ వ్రాశారు. తమ రాజకీయ ఆశయాల కోసం ఎన్నో ఏళ్లుగా మహారాష్ట్ర-కర్ణాటక రాష్ట్రాల సామరస్య బంధానికి విఘాతం కలిగించే చర్యలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఈ ద్రోహులపై కఠిన చర్యలు తీసుకోకుంటే ఇరు రాష్ట్రాల్లో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే ప్రమాదం ఉంది. సిద్దరామయ్య వెంటనే మహారాష్ట్ర ముఖ్యమంత్రితో ఈ చట్టంపై చర్చించాలి. అలాగే, తమ రాజకీయ ప్రయోజనాల కోసం భాషా సామరస్యాన్ని నాశనం చేస్తున్న సొంత పార్టీతో సహా అన్ని పార్టీల నాయకులకు ప్రభుత్వం కన్నడిగుల పక్షాన ఉందన్న హెచ్చరికను పంపవలసిందిగా నేను వారిని కోరుతున్నాను.



# ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులు ముఖ్యమంత్రి భేటీ

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

తెలంగాణలో వివిధ ప్రాజెక్టులపై సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించాలని ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సమావేశమై వివిధ ప్రాజెక్టులపై నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 2001 లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాల నిర్మాణం తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఆనాటి ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి ప్రభుత్వం ఎమ్మార్ సంస్థకు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో అయిదుగురు కార్యదర్శుల స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగ శాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన తాజా చర్చల సందర్భంగా ఈ వివరాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జీషీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015 లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆనాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన మరో కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి అమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ ఆ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలీ రషీద్ అలబ్బర్ నేతృత్వంలో భారత్‌లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అఫైర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ అంబర్ కిషోర్ ఝా






వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్

వరంగల్ - ఖమ్మం - నల్గొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా గురువారం సందర్శించారు. ఈ రోజు ఉదయం హసన్ పర్తి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలతో పాటు హన్మకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ సిపి సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతుల ఏర్పాట్లపై సీపీ ఏసీపీలు తిరుమల్, దేవేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు చేరాలు, రవికుమార్లను అడిగి తెలుసుకున్నారు.

## రాజుల కొత్తపల్లి గ్రామంలోని పురాతన ఆలయాలను సందర్శించిన పురావస్తు శాఖ అధికారి



మహబూబాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్

రాజుల కొత్తపల్లి గ్రామంలోని పురాతన ఆలయాల చరిత్రను వెలుగులోకి తేవడానికి ఇటీవల కాలంలో గ్రామ యువత పురావస్తు శాఖకు విజ్ఞప్తి చేయగా, తాజాగా పురావస్తు శాఖ అధికారి బాబు గారు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో వేణుగోపాలస్వామి ఆలయం, బాలాజీ స్వామి ఆలయాలు 11వ శతాబ్దానికి చెందినవని అధికారి స్పష్టం చేశారు. ఈ ఆలయాలకు చారిత్రక ప్రాధాన్యత ఉన్నదని పేర్కొంటూ, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామ చరిత్రను వెలుగులోకి తేవడానికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ్, చొక్కా చారి, యాకయ్య, అశోక్ హరీష్, పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ ఆలయాల సంరక్షణకు ప్రభుత్వ సహకారం అందించాల్సిందిగా కోరారు.

## దోషులుగా తేలిన నేతలపై జీవితకాల నిషేధానికి వ్యతిరేకం

న్యూఢిల్లీ: వివిధ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాల నిషేధాన్ని విధించాలన్న అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఆరేండ్ల పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది కఠినతరమని పేర్కొంది. దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని వివరిస్తూ బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం విధించడం అత్యంత కఠినమైన చర్య అని, కాబట్టి ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరేండ్ల పాటు నిషేధం సరిపోతుందని తన అఫిడవిట్‌లో పేర్కొంది. అయినా క్రిమినల్ కేసులలో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాల నిషేధం విధించాలా? ఆరేండ్లు నిషేధం విధించాలా? అనేది పార్లమెంట్ పరిధిలోని అంశమని పేర్కొంది. పార్లమెంట్ ఇప్పటికే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆరేండ్లు నిషేధం విధించాలని నిర్ణయించిందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది.

## డోజ్ అధ్యక్షులు అమీ గ్లేసన్ .. మస్క్ కాదు

వాషింగ్టన్ : అమెరికాలోని డోజ్ ( ప్రభుత్వ సామర్థ్య విభాగం) అధ్యక్షులు అమీ గ్లేసన్ అని వైట్‌హౌస్ ప్రకటించింది. హెల్త్ కేర్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న అమీ గ్లేసన్ డోజ్ తాత్కాలిక నిర్వాహకురాలిగా వ్యవహరిస్తారని వైట్‌హౌస్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఏర్పాటు చేసిన డోజ్ డీ ఫ్యాక్టో అధిపతి మస్క్ కాదని గతంలో వైట్ హౌస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాంకేతికత అభివృద్ధి కోసం గతంలో ఒబామా ఏర్పాటు చేసిన ఈ సంస్థ పేరును ట్రంప్ డోజ్‌గా మార్చారు. క్లిష్టమైన ప్రజాసేవలను నిర్వీర్యం చేసేందుకు మస్క్ యత్నిస్తున్నారని విమర్శిస్తూ డోజ్‌కు చెందిన 20 మందికి పైగా సభ్యులు రాజీనామా చేయడంతో మంగళవారం ఈ ప్రకటన వెలువడింది. వేలాది ఉద్యోగాల్లో కోత విధించడంతో పాటు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలంటూ ట్రంప్ ఈ సంస్థను ఏర్పాటు చేశారు.

## నూతన జంటను ఆశీర్వదించండి

నమీండ్ల వారి పెళ్లి పిలుపు



హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

భీమారం శుభం ఫంక్షన్ హాల్ లో దేవుడి ఆశీస్సులతో దేవుడిచే దీవించబడిన సలామి - మహేష్ ల నూతన జంట ఒక్కటై కలకాలం, నిండు నూరేళ్ళు, ఆయురారోగ్యాలతో, సకల ఐశ్వర్యాలతో ఉండాలని ఒక్కటయ్యే ఈ జంటను ఆశీర్వదించాలని, వెడ్డింగ్ కార్డు అందిన వారు, అందని వారు, శ్రేయోభిలాషులు, బందువులు, స్నేహితులు, అందరూ ఆహ్వానితులై మమ్మల్ని ఆశీర్వాదించగలరని పత్రిక పరంగా కోరారు. మా ఈ ఆహ్వానాన్ని మన్నించి ఆతిథ్యాన్ని స్వీకరించి నూతన జంటను ఆశీర్వదించాలని తెలిపారు.

## గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో భోజనాల కోసం కొట్లాట

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ప్రపంచ మదుపరుల శిఖరాగ్ర సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. దీనికి దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున మదుపర్లు హాజరై రూ.లక్షల కోట్ల మేర పెట్టబడులను ప్రకటించారు. అయితే, ఈ కార్యక్రమంలో ఏర్పాట్లు మాత్రం అరకొరగా ఉన్నాయి. ఈ సదస్సుకు వచ్చిన అతిథులు భోజన ప్లేట్ల కోసం కొట్లాడుకుంటున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అతిథులు హాజరయ్యారు. అయితే, సరైన సౌకర్యాలు లేకపోవడంతో భోజన సమయంలో వారంతా ప్లేట్ల కోసం పోటీపడ్డారు. దీంతో కొన్ని ప్లేట్లు విరిగి కిందపడ్డాయి. ఈ దృశ్యాలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రపంచస్థాయి సదస్సులో ఇలాంటి ఏర్పాట్లు బాధాకరమంటూ మండిపడ్డాయి. ఈ నెల 24-25 తేదీల్లో ఈ ఇన్వెస్టర్ల సదస్సు జరిగింది. ఇందులో తమ రాష్ట్రంలో రూ.26.61లక్షల కోట్ల పైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరినట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు..

## అమెరికా పౌరసత్వం ఏ 50 లక్షల డాలర్లు





వాషింగ్టన్ : సంపన్నులైన వలసదారులు అమెరికా పౌరసత్వం పొందేందుకు గానూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త ఆఫర్ ప్రకటించారు. 50 లక్షల డాలర్లతో గోల్డ్ కార్డు కొంటే పౌరసత్వం లభిస్తుందని చెప్పారు. గ్రీన్ కార్డ్ నివాస హోదాను ఇవ్వడంతోపాటు విదేశీయులకు అమెరికా పౌరసత్వానికి ఈ గోల్డ్ కార్డులు బాట వేస్తాయని చెబుతున్నారు. 10 లక్షల కార్డులు అమ్ముడవుతాయని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ చొరవ తీసుకోవడం వల్ల జాతీయ రుణాలను త్వరగా తీర్చివేయగలుగుతామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇబి-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా కార్యక్రమం స్థానంలో ఈ గోల్డ్ కార్డులను ప్రవేశపెట్టనున్నట్లు ట్రంప్ విలేకర్లతో చెప్పారు. అమెరికా ఉద్యోగాలను సంరక్షించే లేదా సృష్టించేంత పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించే విదేశీ పెట్టుబడిదారులు ఈ గోల్డ్ కార్డులతో శాశ్వత నివాసులుగా మారడానికి అనుమతించబడుతుంది. అమెరికా వ్యాపారాల్లో పెట్టుబడులు పెడతామనే హామీలతో విదేశీయులకు గ్రీన్ కార్డులను ఇబి-5 ప్రోగ్రామ్ కింద ఇప్పటివరకు మంజూరు చేస్తూ వచ్చారు. సంపన్నులు ఈ కార్డును కొనుగోలు చేసి తమ దేశంలోకి ప్రవేశించవచ్చని చెప్పారు. రెండు వారాల్లో ఈ పథకం అమల్లోకి రానుంది. అప్పుడు మొత్తం వివరాలు తెలుస్తాయని ట్రంప్ చెప్పారు. రష్యన్లు ఈ పథకానికి అర్హులా అని ఒక విలేకరి ప్రశ్నించగా, అర్హులేనని చెబుతూ రష్యన్ సంపన్నుల్లో కొందరు చాలా మంచివారని వ్యాఖ్యానించారు.

## నివాసప్రాంతంలో కూలిన సైనిక విమానం..

కైరో : సూడాన్‌లోని వాడి సయిద్నా వైమానిక స్థావరం నుండి టేకాఫ్ అవుతుండగా సైనిక విమానం కూలిపోయి 46 మంది మరణించారు. ఈ విషయాన్ని ప్రాంతీయ ప్రభుత్వ అధికారులు బుధవారం తెలిపారు. సూడాన్‌కు చెందిన మిలటరీ విమానం ఖార్టూమ్ శివార్లలో నివాస ప్రాంతాల్లో కూలిపోవడంతో ఈ ఘోరం చోటు చేసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు కలిగిన రెడ్ సీ సిటీకి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ విమానంలో ఉన్నత స్థాయి సైనికాధికారులు వున్నారని స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఆ వార్తలను మిలటరీ ధ్రువీకరించనూ లేదు, ఖండించనూ లేదు. మొత్తంగా 46 మంది మరణించగా, 10 మంది గాయపడ్డారని ఖార్టూమ్ రీజనల్ ప్రభుత్వ మీడియా విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. గాయపడిన వారిలో చిన్నారులు కూడా వున్నారని, అందరికీ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సాంకేతిక లోపమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నట్లు పేరు వెల్లడించడానికి ఇష్టపడని సైనిక వర్గాలు తెలిపాయి. పెద్ద శబ్దం వినిపించిందని, ఆ వెంటనే నల్లని దట్టమైన పొగ కమ్ముకుపోయిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఈ కారణంగా ఆ ప్రాంతమంతా విద్యుత్ తీగలు తెగి అంధకారం అలుముకుంది.



# తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ రెడీ..




బుల్లెట్ రైలు గంటకు 450 కి.మీ వేగంతో నడుస్తుంది. హైపర్‌లూప్‌లోని రైళ్లు ఏకంగా గంటకు 1100 కిలోమీటర్ల వేగంతో నడుస్తాయి. ఇప్పుడు దేశంలోనే తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ పూర్తిగా రెడీ అయింది. దీన్ని ఐఐటీ మద్రాస్ తయారు చేసింది. ఈ ట్రాక్ పొడవు 410 మీటర్లు. దీన్ని ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లోనే నిర్మించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి భారత రైల్వేశాఖ ఆర్థిక సహాయం అందించింది. ఐఐటీ మద్రాస్ విద్యార్థులు 'అవిష్కార్ హైపర్‌లూప్' పేరుతో ఒక బృందంగా ఏర్పడి ఈ హైపర్ లూప్ ట్రాక్‌ను తయారు చేశారు. ఇందులో 11 కోర్సులకు చెందిన 76 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ హైపర్‌లూప్ ట్రాక్‌పై త్వరలో ట్రయల్ రన్‌లు ప్రారంభమవుతాయి. ఈ ట్రయల్స్ సక్సెస్ అయితే ఈ అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థను మనదేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున వినియోగంలోకి తీసుకురావచ్చు. 'హైపర్ లూప్' అంటే ప్రత్యేకమైన వాక్యూమ్ ట్యూబ్. ఈ ట్యూబ్‌లో ప్రత్యేకమైన రైల్వే ట్రాక్ ఉంటుంది. "హైపర్‌లూప్ ట్యూబ్‌లోని 'లూప్' అంటే అత్యల్ప గాలి పీడనంతో కూడిన ట్యూబ్. పాడ్ అనే మరో భాగం కూడా ఇందులో ఉంటుంది. ఇది రైలు బోగీ లాంటి వాహనం. టెర్మినల్ అంటే హైపర్‌లూప్ బోగీలు ఆగే ప్రదేశం. హైపర్ లూప్ ట్రాక్‌పై నుంచి అధిక వేగంతో రైలు దూసుకుపోతుంది. దీనివల్ల ఎలాంటి ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా రైళ్లను నడిపే అవకాశం కలుగుతుంది. ఫలితంగా ప్రయాణికులకు ఎంతో సమయం ఆదా అవుతుంది. రైలు వేగం పెరుగుతుంది. అతి తక్కువ సమయంలోనే గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. ఢిల్లీ నుంచి ముంబైకి, ముంబై నుంచి పూణేకు, హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం అరగంటలోనే మనం చేరుకోవచ్చు. వాక్యూమ్ ట్యూబ్‌లో ప్రయాణం జరగడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా తగ్గిపోతాయి. ఈ వాక్యూమ్ ట్యూబ్‌లోని రైలులో ప్రయాణించే వారి కోసం ఆక్సిజన్ వసతి, వెంటిలేషన్ సౌకర్యం ఉంటాయి. కాబట్టి ఇందులో సేఫ్‌గా ప్రయాణించొచ్చు. దేశంలోనే తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ వీడియోను తాజాగా భారతదేశ రైల్వే మంత్రిత్వ శాఖ ఎక్స్ వేదికగా విడుదల చేసింది.

# బంగారానికి అధిక ధరల దెబ్బ

### సగానికి తగ్గిన దిగుమతులు..!

పేద, సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంతో పసిడికి డిమాండ్ పడిపోతోంది. దీంతో దిగుమతులు సగానికి తగ్గనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారం దిగుమతులు 15 టన్నులకు పరిమితం కానుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఏడాది క్రితం నాటి దిగుమతులతో పోల్చితే 85 శాతం క్షీణించి.. 20 ఏళ్ల నాటి కనిష్ట స్థాయికి పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలోని 30-35 టన్నుల దిగుమతులతో పోల్చితే దాదాపుగా సగానికి క్షీణించొచ్చని విశ్లేషించింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ ధర రికార్డ్ స్థాయిలో 2,956 డాలర్లకు ఎగిసింది. అధిక ధరల కారణంగా డిమాండ్ భారీగా తగ్గింది. అమెరికా వాణిజ్య సుంకాల దాడికి తోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఆందోళనలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. వీటికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా క్షీణించి పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. 2025 జనవరిలో బంగారం దిగుమతులు 30-35 టన్నులకు పడిపోయి.. ఆరు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నెలలో డిమాండ్ మరింత సన్నగిల్లిందని రిద్ధిసిద్ధి బులియన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ కొఠారి పేర్కొన్నారు. దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, రికార్డు స్థాయిలో పెరిగిన ధరల కారణంగా ఈ నెలలో బంగారం దిగుమతులు 50 శాతం తగ్గొచ్చన్నారు. దేశంలో వివాహాల సీజన్ కొనసాగుతున్నప్పటికీ డిమాండ్ తక్కువగానే ఉందన్నారు. ధరలు పెరగక ముందు కొన్ని బ్యాంక్‌లు దిగుమతి చేసుకున్న బంగారాన్ని తిరిగి అమెరికాకు పంపిస్తున్నాయన్నారు. దీంతో అధిక రాబడులను పొందుతున్నాయన్నారు. భారత్‌లోని ఆభరణాల తయారీదారుల కోసం టోకుగా ఒక్క ఔన్స్‌పై 23 డాలర్ల తగ్గింపును అందిస్తోన్నాయన్నారు.



# స్మార్ట్‌ఫోన్ సర్వీస్ సెంటర్లను మూలంగా మారుస్తున్న శామ్‌సంగ్

శామ్‌సంగ్, భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, తన స్మార్ట్‌ఫోన్ కస్టమర్ సర్వీస్ అనుభవాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి సేవా కేంద్రాలను సమూలంగా పునరుద్ధరిస్తోంది. ప్రీమియం కస్టమర్ కేర్ మీద బలమైన దృష్టి సారించి, అమ్మకాల తర్వాత అత్యుత్తమైన మద్దతుకు శామ్‌సంగ్ నిబద్ధతను బలోపేతం చేస్తూ, సజావు సర్వీస్-టు-సేల్స్ ప్రయాణాన్ని ఏర్పాటు చేయడం ఈ చొరవ లక్ష్యం. యువ మరియు డైనమిక్ కస్టమర్ బేస్ యొక్క అభివృద్ధి చెందుతున్న అంచనాలను తీర్చడానికి, శామ్‌సంగ్ తన సేవా కేంద్రాలను ఇంటిగ్రేటెడ్ ఓమ్ని-ఛానల్ అనుభవానికి అనుగుణంగా పునర్నిర్మించింది. ఈ ఆధునికీకృత కేంద్రాలు, అధునాతన డిజిటలైజ్డ్ ప్రక్రియలతో కూడినవిగా ఉండి, వేగవంతమైన, సమర్థవంతమైన సేవను అందించడానికి రూపొందించబడ్డాయి. వైవిధ్యమైన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ప్రదర్శించడమే కాకుండా, ఖచ్చితమైన సమస్యను గుర్తించేందుకు అత్యాధునిక డయాగ్నొస్టిక్ సాధనాలను వినియోగించడం ద్వారా, శామ్‌సంగ్ తన సాంకేతిక అగ్రభాగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. అప్‌గ్రేడ్ చేయబడిన సర్వీసు కేంద్రాలు సాంప్రదాయ లేఅవుట్లకు భిన్నంగా, అధునాతన డిజైన్‌తో మరింత సౌకర్యవంతమైన లాంజ్ వంటి వాతావరణాన్ని అందిస్తాయి. ఇందులో అంతర్నిర్మిత వైర్‌లెస్ ఛార్జింగ్ స్టేషన్లు మరియు ఖరీదైన సోఫా-శైలి సీటింగ్ ఉంటాయి, వినియోగదారులు మరింత ఆహ్లాదకరమైన అనుభవాన్ని పొందగలరు. పునఃరూపకల్పన చేసిన గోడలు శామ్‌సంగ్ యొక్క ధరించగలిగిన ఉత్పత్తుల




విస్తృత శ్రేణిని హైలైట్ చేస్తాయి, కాగా అల్ట్రా-లార్జ్ డిజిటల్ స్క్రీన్లు తాజా ఉత్పత్తి ఆవిష్కరణలను చూపించి సందర్శకులకు లీనమయ్యే అనుభవాన్ని అందిస్తాయి. కస్టమర్ పరస్పర చర్యలను మెరుగుపరచడానికి, ప్రత్యేక కియోస్క్‌లు సందర్శకులకు ఉత్పత్తి మద్దతు నిపుణులతో కనెక్ట్ అవ్వడానికి, కొత్త ఉత్పత్తి ఆవిష్కరణలను అన్వేషించడానికి మరియు ప్రత్యేక ఆఫర్లు మరియు తగ్గింపులపై తాజాగా ఉండటానికి వీలు కల్పిస్తాయి. ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ బుకింగ్ వ్యవస్థ వినియోగదారులకు వారి సందర్శనలను ముందుగానే షెడ్యూల్ చేయడానికి వీలు కల్పిస్తుంది, కనీస వేచి ఉండే సమయాలతో ఇబ్బంది లేని అనుభవాన్ని నిర్ధారిస్తుంది. శామ్‌సంగ్ ప్రస్తుతం ఫిజికల్ సర్వీస్ సెంటర్లు, రెసిడెంట్ ఇంజనీర్లు మరియు కలెక్షన్ పాయింట్లతో సహా భారతదేశం అంతటా 3,000కి పైగా సర్వీస్ టచ్ పాయింట్లను నిర్వహిస్తోంది. సర్వీస్ సెంటర్ పునఃరూపకల్పన ప్రారంభించడం కీలక నగరాల్లో దశలవారీగా అమలు చేయబడుతుంది, ఇది దేశవ్యాప్తంగా మెరుగైన కస్టమర్ అనుభవాన్ని నిర్ధారిస్తుంది.

## పన్ను ఎగవేతదారులపై ఐటీ నజర్



గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో (2022-23, 2023-24) పన్ను మినహాయింపుల్లో అవకతవకలకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్న 40,000 మంది పన్ను చెల్లింపుదారులపై ఐటీ శాఖ నిఘా పెట్టింది. టీడీఎస్ (మూలస్థానంలో పన్ను వసూలు) క్లెయిమ్స్‌లో అవకతవకతలను గుర్తించేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సమగ్రమైన 16 అంచెల వ్యూహాన్ని రూపొందించింది. అనుమానిత పన్ను చెల్లింపుదారుల ఐటీ రిటర్నులను పునఃసమీక్షించేందుకు ఆదాయపు పన్ను శాఖకు చెందిన డేటా అనలిటిక్స్ బృందం ఇప్పటికే జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. తొలుత వారికి నోటీసు పంపి, వారి రిటర్నుల్లో ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకునేందుకు ఓ అవకాశం ఇవ్వనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తరచుగా ఇలాంటి తప్పులకు పాల్పడుతున్నవారిపై, ముఖ్యంగా ముందస్తు పన్ను చెల్లింపులు- పన్ను మినహాయింపుల్లో వ్యత్యాసం ఉన్న కేసులు, మినహాయింపుదారు వివరాల్లో తరచుగా సవరణలు జరుగుతున్న సందర్భాలపై ఐటీ డిపార్ట్‌మెంట్ ప్రధానంగా దృష్టిసారించనున్నట్లు సమాచారం.

## ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 20 శాతం వేతనం పెంపు

దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు తీపికబురు అందించింది. అర్హులైన ఉద్యోగులకు వేతనాలు పెంచుతున్నట్లు తెలిపింది. ఉద్యోగులకు సగటున 5 నుంచి 8 శాతం వరకు జీతాన్ని పెంచినట్లు తెలుస్తోంది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు 20 శాతం వేతనాలు పెంచినట్లు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఉద్యోగులను మూడు విభాగాలుగా వర్గీకరించింది.. సంస్థ లక్ష్యాలను అందుకున్న వారికి 5-7 శాతం జీతాన్ని పెంచింది. అంతకంటే మెరుగ్గా పని చేసిన వాళ్లకు 7-10 శాతం, అత్యుత్తమ ప్రదర్శన చూపిన వారికి 10-20 శాతం వరకు వేతనం పెంచింది. మరోవైపు అతి తక్కువ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు జీతాన్ని పెంచలేదని తెలుస్తోంది. నూతన వేతన పెంపు జనవరి ఒక్కటో తేది నుంచే అమల్లోకి వచ్చింది. చివరి సారిగా 2023 నవంబర్‌లో వేతన పెంపుదల చేసింది.




## సమీప కాలంలో మార్కెట్లలో అస్థిరత..!

భారత స్టాక్ మార్కెట్లు సమీప కాలంలో అస్థిరంగా ఉంటాయని ప్రముఖ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ పిఎల్ క్యాపిటల్ ప్రభుదాస్ లీలాధర్ అంచనా వేసింది. గతేడాది డిసెంబర్‌తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో సూచీలు స్థిరీకరణ స్థాయికి చేరాయని పేర్కొంది. భవిష్యత్తులో అధిక మూలధనం వ్యయం, పన్ను కోతలు, వినియోగదారుల డిమాండ్ పునరుద్ధరణ నేపథ్యంలో విదేశీ సంస్థాగత మదుపర్ల పెట్టుబడులు సానుకూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషించింది. వచ్చే 12 నెలల్లో నిఫ్టీ 25,689కి చేరొచ్చని భావించింది. మంగళవారం నాటికి ఈ సూచీ 22,547కు పడిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం ద్వారా రూ.1 లక్ష కోట్లు వినిమయంలోకి రావొచ్చని తెలిపింది. పెంచిన ప్రభుత్వ వ్యయాలు మార్కెట్లకు మద్దతును అందించే అవకాశం ఉందని పేర్కొంది.

## హైదరాబాద్‌లో ఎజిలీసియం 'జీసీసీ' 2,000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. లైఫ్ సైన్సెస్, ఫార్మా కంపెనీలకు జనరేటివ్ ఏఐ ఆధారిత వినూత్న డేటా అనలిటికల్ సేవలందించే అమెరికా కంపెనీ ఎజిలీసియం 'లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ అండ్ టాలెంట్ డెవలప్‌మెంట్ లాబ్' పేరుతో ఈ జీసీసీని ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఇంజినీరింగ్ రంగాలకు చెందిన 50 మంది నిపుణుల నియామకాలు పూర్తి చేసినట్టు కంపెనీ వ్యవస్థాపకులు, సీఈఓ రాజబాబు 'బయో ఏషియా, 2025' సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. 2027 నాటికి తమ హైదరాబాద్ జీసీసీలో 2,000 ఉద్యోగాలు కల్పించబోతున్నట్టు తెలిపారు. లైఫ్ సైన్సెస్ కంపెనీల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు, వాటి అమ్మకాలు, మార్కెటింగ్‌కు జెనరేటివ్ ఏఐ ఆధారిత వినూత్న డేటా సేవలందించడం ఎజిలిసిఎం కంపెనీ ప్రత్యేకత. మౌలిక సదుపాయాలతో పాటు నిపుణులైన ఉద్యోగుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో తమ జీసీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు రాజబాబు చెప్పారు. ప్రస్తుతం తమకు ఉన్న యాభైకి పైగా క్లయింట్లలో 10 నుంచి 20 శాతం భారతీయ కంపెనీలన్నారు.



# మతిపోగొడుతున్న ఆఫ్ఘనిస్థాన్ స్ట్రాటజీ!

ఛాంపియన్స్ ట్రోఫీలో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం సృష్టించింది. పటిష్టమైన ఇంగ్లండ్ జట్టుపై 325 పరుగుల భారీ స్కోర్ చేయడమే కాకుండా.. ఆ స్కోర్‌ను ఛేజ్ చేయనివ్వకుండా ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసి 8 పరుగుల తేడాతో ఓడించి.. వారికి ఏకంగా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి ఎలిమినేట్ చేసింది. ఆఫ్ఘాన్ క్రికెట్‌కు ఇదో మధుర విజయంగా చెప్పవచ్చు. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలోనే కాదు.. గతే రెండు మూడేళ్లుగా ఆఫ్ఘాన్ క్రికెట్ టీమ్ అద్భుతంగా ఆడుతోంది. కేవలం టాప్ 8 టీమ్స్ మాత్రమే ఆడే ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రీలంక, వెస్టిండీస్ లాంటి జట్లను దాటి ఆఫ్ఘనిస్థాన్ చోటు సాధించిందంటే.. గత కొంత కాలంగా వారి ప్రదర్శన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఐసీసీ ఈవెంట్స్‌లో మాత్రం ఆఫ్ఘనిస్థాన్ అందర్ని ఆకట్టుకుంటుంది. 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక లాంటి పెద్ద టీమ్స్‌ను ఓడించింది. ఆస్ట్రేలియాను కూడా ఆలోమోస్ట్ ఓడించినంత పనిచేసింది. కానీ, మ్యాక్స్ వెల్ ఒక్కడే అడ్డుకున్నాడు. అలాగే గతేడాది జరిగిన 2024 టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్‌లను ఓడించింది. ఇక ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. అయితే.. ఆఫ్ఘాన్ సాధిస్తున్న ఈ అద్భుత విజయాల వెనుక వారి నిరంతర శ్రమ, కృషి, పట్టుదల, గెలవాలనే కసి, అద్భుతమైన టాలెంటెడ్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ.. ఇంకో కనిపించని స్ట్రాటజీ కూడా ఉంది. ఒక్కసారి దాన్ని పరిశీలిస్తే.. ఆఫ్ఘాన్ తెలివికి.. వావ్ హ్యాట్సాఫ్ అనాల్సిందే. 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఆఫ్ఘాన్ మంచి ప్రదర్శన చేసి.. ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక జట్లను ఓడించిందని పైన చెప్పుకున్నాం.. ఆ వరల్డ్ కప్ సమయంలో వాళ్ల మెంటర్‌గా టీమిండియా మాజీ క్రికెటర్ అజయ్ జడేజా




ఉన్నారు. అలాగే 2024 టీ20 వరల్డ్ కప్‌లో కూడా ఆఫ్ఘాన్ అద్భుత ప్రదర్శన కనబర్చి.. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్‌లను ఓడించింది.. అప్పుడు వాళ్ల బౌలింగ్ కోచ్ కమ్ మెంటర్‌గా వెస్టిండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో ఉన్నాడు. అలాగే ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించింది.. ఇప్పుడు వాళ్ల బ్యాటింగ్ కోచ్ కమ్ మెంటర్‌గా యూనిస్ ఖాన్ ఉన్నాడు. 2023 వన్డే వరల్డ్ కప్ ఇండియాలో జరిగింది.. సో టీమిండియా మాజీ క్రికెటర్‌ను మెంటర్‌గా నియమించుకున్నారు. టీ20 వరల్డ్ కప్ 2024 ఎక్కువ భాగం వెస్టిండీస్(కొన్ని మ్యాచ్‌లు అమెరికాలో కూడా జరిగాయి)లో జరిగింది.. సో వెస్టిండీస్ మాజీ క్రికెటర్‌ను వాళ్ల మెంటర్‌గా నియమించుకున్నారు. ఇప్పుడు ఈ ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్‌లో జరుగుతుంది కనుక పాకిస్థాన్ మాజీ కెప్టెన్ యూనిస్ ఖాన్‌ను వాళ్ల మెంటర్‌గా నియమించుకున్నారు. కేవలం వాళ్ల వల్లే ఆఫ్ఘనిస్థాన్ ఇంత అద్భుతంగా ఆడుతుందని చెప్పడం సరికాదు కానీ, ఆ దేశాల్లో పెద్ద టోర్నీలో జరుగుతున్నప్పుడు.. ఆ దేశాల్లోని పిచ్‌లపై, కండీషన్లపై, అలాగే ప్రత్యర్థి జట్లపై ఆడిన అనుభవం కచ్చితంగా ఎంతో కొంత ఆఫ్ఘనిస్థాన్‌కు కలిసి వస్తుందని చెప్పవచ్చు. పైగా ఏ దేశంలో మెగా టోర్నీ జరిగితే.. ఆ దేశపు మాజీ క్రికెటర్ మెంటర్‌గా నియమించుకొని ఆఫ్ఘాన్ ఇప్పటి వరకు మంచి ఫలితాలే పొందింది.

## ఛాంపియన్స్ ట్రోఫీలో చరిత్ర సృష్టించిన ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్!



ఆఫ్ఘనిస్థాన్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ ఇబ్రహీం జద్రాన్ తన తుఫాను బ్యాటింగ్‌తో ఛాంపియన్స్ ట్రోఫీ రికార్డులను ధ్వంసం చేశాడు. జద్రాన్ పేలుడు బ్యాటింగ్ ముందు ఇంగ్లీష్ జట్టు బౌలింగ్ అటాక్ తేలిపోయింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జద్రాన్ ఫోర్లు, సిక్సర్లు బాదాడు. ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్ 146 బంతుల్లో 177 పరుగుల చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను 12 ఫోర్లు, ఆరు సిక్సర్లు కొట్టాడు. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అతిపెద్ద ఇన్నింగ్స్ ఆడిన బ్యాట్స్‌మెన్‌గా జద్రాన్ నిలిచాడు. దీంతో వన్డేల్లో ఆఫ్ఘనిస్థాన్ తరపున అతిపెద్ద ఇన్నింగ్స్ ఆడిన బ్యాట్స్‌మెన్‌గా కూడా జద్రాన్ నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఇబ్రహీం జద్రాన్ తన తుఫాను బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్ ఓపెనర్ 177 పరుగులతో తుఫాను ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్ ప్రతి బౌలర్‌ను చిత్తు చేశాడు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే అతిపెద్ద ఇన్నింగ్స్ ఆడిన రికార్డు జద్రాన్ పేరిట నమోదైంది. నాలుగు రోజుల క్రితం బెన్ డకెట్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో డకెట్ 165 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆఫ్ఘనిస్థాన్ తరపున వన్డే క్రికెట్‌లో అతిపెద్ద ఇన్నింగ్స్ ఆడిన రికార్డు కూడా ఇబ్రహీం జద్రాన్ పేరిట నమోదైంది. 2022లో తన రికార్డును తానే బద్దలు కొట్టాడు. జద్రాన్ 2022లో శ్రీలంకపై 162 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. జద్రాన్ ప్రత్యేకంగా గడ్డాఫీ స్టేడియంలో జోఫ్రా ఆర్చర్‌ను లక్ష్యంగా చేసుకున్నాడు. ఆర్చర్‌పై ఇన్నింగ్స్ 45వ ఓవర్‌లో జద్రాన్ మూడు ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టి ఓవర్‌లో 20 పరుగులు చేశాడు. అదే సమయంలో జో రూట్ కూడా పరుగులు ఇచ్చాడు. అతని ఓవర్‌లో 23 పరుగులు వచ్చాయి. ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 325 పరుగులు సాధించింది. ఇబ్రహీం జద్రాన్ పాక్ గడ్డపై వన్డే క్రికెట్‌లో నాలుగో అత్యధిక ఇన్నింగ్స్ స్కోరు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. 1996లో 188 పరుగులతో అజేయ ఇన్నింగ్స్ ఆడిన గ్యారీ కిర్‌స్టన్ పేరిట పాకిస్థాన్‌లో అతిపెద్ద ఇన్నింగ్స్‌లు ఆడిన రికార్డు. ఇదే సమయంలో ఈ జాబితాలో వివ్ రిచర్డ్స్ ఇన్నింగ్స్ 181 పరుగులతో రెండవ స్థానంలో ఉన్నాడు. ఫఖర్ జమాన్ 2023లో 180 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ ఇవే.. కోహ్లీ ఎన్నో ర్యాంక్‌లో ఉన్నాడంటే?

ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా అద్భుత ఫామ్‌లో కనపడుతోంది. పాకిస్థాన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరిన భారత జట్టుకు మరింత బలంగా విరాట్ కోహ్లీ కూడా ఫామ్‌లోకి వచ్చాడు. పాకిస్థాన్‌పై అద్భుత సెంచరీతో విరాట్ కోహ్లీ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో కూడా దూసుకెళ్లాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు విరాట్ కోహ్లీ ఫామ్‌పై అనేక ప్రశ్నలు తలెత్తాయి. బంగ్లాదేశ్‌తో ఆడిన తొలి మ్యాచ్‌లో కోహ్లీ ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు. అయితేపాకిస్తాన్‌పై విరాట్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 51వ వన్డే సెంచరీని నమోదు చేశాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీ తన బ్యాటింగ్ స్థానాలను మెరుగుపర్చుకున్నాడు. ర్యాంకింగ్స్‌లో కోహ్లీ ఒక్క స్థానం ఎగబాకాడు. 743 రేటింగ్ పాయింట్లతో కోహ్లీ ఐదో స్థానానికి చేరుకున్నాడు. శుభమన్ గిల్ ఇటీవలి ఫామ్ చాలా అద్భుతంగా ఉంది. గిల్ ప్రతి మ్యాచ్‌లోనూ పరుగులు చేస్తున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ అద్భుత సెంచరీ సాధించాడు. పాకిస్థాన్‌పై గిల్ 46 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ప్రస్తుతం ఐసీసీ వన్డే బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ 817 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్థాన్ స్టార్ బ్యాట్స్‌మెన్ బాబర్ 770 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. దీంతో పాటు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 757 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ హెన్రిచ్ క్లాసెన్ 749 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. శ్రేయాస్ అయ్యర్ కూడా టాప్ 10లో ఉన్నాడు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్‌పై 3 వికెట్లు తీసిన కుల్దీప్, షమీ వన్డే ర్యాంకింగ్స్‌లో ప్రయోజనం పొందారు. మూడో స్థానం నుంచి రెండో స్థానానికి చేరుకున్నాడు. మహ్మద్ షమీ కూడా ఒక స్థానం ఎగబాకాడు. కాగా శ్రీలంక స్పిన్ బౌలర్ మహేశ్ తీక్షణ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.




# యుపిపై ముంబయి ఘన విజయం

మహిళల ప్రిమియర్ లీగ్



మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో ముంబయి ఇండియన్స్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో యుపి వారియర్స్‌తో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబయి జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి ఆల్‌రౌండర్ స్కీవర్ బ్రంట్ మూడు వికెట్లు తీసి యుపి కట్టడి చేయడంతోపాటు 75పరుగులు చేసి ముంబయి గెలుపులో కీలకపాత్ర పోషించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యుపి వారియర్స్‌ను ముంబయి బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా స్కీవర్ బ్రంట్(3/18)కి తోడు ఇస్మాయిల్(2/33), సంస్కృతి గుప్తా(2/11) బౌలింగ్‌లో చెలరేగారు. దీంతో యుపి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 142 పరుగులు మాత్రమే చేయగలిగింది. యుపి ఇన్నింగ్స్‌లో గ్రేస్ హ్యారిస్(45) టాప్ స్కోరర్‌గా నిలువగా.. వృంద దినేశ్(33) ఓ మోస్తరు స్కోర్ చేసింది. శ్వేతా సెహ్రావత్ (19), ఉమా ఛెత్రీ (13 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేశారు. కిరణ్ నవ్‌గిరే (1), కెప్టెన్ దీప్తి శర్మ (4), తహ్లియా మెక్‌గ్రాత్ (1), చిన్నెల్ హెన్రీ (7), సోఫీ ఎక్లెస్టోన్ (6) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సైమా ఠాకోర్ డకౌట్ కాగా.. క్రాంతి గౌడ్ (5) అజేయంగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో యూపీ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగిందంటే గ్రేస్ హ్యారిస్, వృంద దినేశ్ చలువే. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 79 పరుగులు జోడించారు. వీరిద్దరు క్రీజ్‌లో ఉండగా.. యుపి భారీ స్కోర్ చేసేలా కనిపించింది. అయితే స్వల్ప వ్యవధిలో వీరు ఔట్ కావడంతో యూపీ ఇన్నింగ్స్ పతనం మొదలైంది. మధ్యలో శ్వేతా సెహ్రావత్, ఉమా ఛెత్రీ కొద్ది సేపు నిలకడగా బ్యాటింగ్ చేయడంతో యూపీ 100 పరుగుల మార్కును దాటగలిగింది. ఛేదనలో ముంబయి ఓపెనర్ మాథ్యూస్(59) రాణించినా.. యాస్టికా భాటియా(0) నిరాశపరిచింది. ఆ తర్వాత స్కీవర్(75నాటౌట్‌బీ 44బంతుల్లో 13ఫోర్లు) మ్యాచ్‌ను ముగించింది. తొలి 2 ఓవర్లలో ఆ జట్టు వికెట్లేమీ నష్టపోనప్పటికీ 2 పరుగులు మాత్రమే చేయగలిగింది. చిన్నెల్ హెన్రీ, సోఫీ ఎక్లెస్టోన్ తొలి రెండు ఓవర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(4నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో ముంబయి జట్టు 17ఓవర్లలో కేవలం 2వికెట్లు కోల్పోయి 143పరుగులు చేసి విజయం సాధించింది. యుపి బౌలర్లలో ఎక్లేస్టోన్, దీప్తి శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి.

# శుభ్‌మన్ టాప్ ర్యాంక్ పదిలం



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) బుధవారం తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. గిల్ 817 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. బాబర్ ఆజమ్ (పాకిస్థాన్) రెండో ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మమూడో ర్యాంక్‌కు ఢోకా లేకుండా పోయింది. అతను మూడో స్థానంలో ఉన్నాడు. సౌతాఫ్రికా విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఒక ర్యాంక్‌ను మెరుగుపరుచుకుని తిరిగిటాప్5లో చోటు సంపాదించాడు. పాక్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో కోహ్లి అజేయ శతకంతో రాణించిన సంగతి తెలిసిందే. దీంతో కోహ్లి ఐదో ర్యాంక్‌కు దూసుకొచ్చాడు. డారిల్ మిఛెల్ (న్యూజిలాండ్), హ్యారి టెక్టర్ (ఐర్లాండ్), అసలంక (శ్రీలంక), శ్రేయస్ అయ్యర్ (భారత్), షాయ్ హోప్ (విండీస్) టాప్10లో చోటు కాపాడుకున్నారు. బౌలింగ్ విభాగంలో శ్రీలంక బౌలర్ మహీశ్ తీక్షణ టాప్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. రషీద్ ఖాన్ (అఫ్గాన్) రెండో ర్యాంక్‌లో నిలిచాడు.భారత బౌలర్ కుల్దీప్ యాదవ్ మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

# ఓదార్పు దక్కేదెవరికో?

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గురువారం జరిగే గ్రూప్ఎ మ్యాచ్‌లో ఆతిథ్య పాకిస్థాన్‌తో బంగ్లాదేశ్ తలపడనుంది. ఇరు జట్లు ఇప్పటికే సెమీ ఫైనల్ రేసు నుంచి వైదొలిగాయి. భారత్,న్యూజిలాండ్ జట్ల చేతుల్లో ఓటమి పాలు కావడంతో ఇరు జట్ల ఇప్పటికే నాకౌట్‌కు దూరమయ్యాయి. దీంతో కనీసం చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి కాస్తయిన పరువును దక్కించుకోవాలని భావిస్తున్నాయి. చిరకాల ప్రత్యర్థి భారత్‌తో జరిగిన కిందటి మ్యాచ్‌లో పాక్ ఘోర పరాజయం చవిచూసింది. ఈ ఓటమితో పాక్ ఆత్మవిశ్వాసం పూర్తిగా దెబ్బతిన్నది. బంగ్లాదేశ్ కూడా చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో కంగుతిన్నది. అంతకుముందు భారత్‌తో జరిగిన పోరులోనూ బంగ్లాదేశ్‌కు ఓటమి ఎదురైంది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడడంతో పాక్, బంగ్లా సెమీస్ ఆశలకు తెరపడింది. ఈ గ్రూపు నుంచి భారత్, న్యూజిలాండ్ టీమ్‌లు ఇప్పటికే సెమీస్ బెర్త్‌లను దక్కించుకున్నాయి. కాగా, బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలనే లక్షంతో పాక్ ఉంది. వరుస ఓటములతో పాకిస్థాన్‌పై విమర్శల వర్షం కురుస్తోంది. ఈ పరిస్థితుల్లో బంగ్లాపై గెలిచి కాస్తయినా ఊరట పొందాలనే లక్షంతో ఉంది. బ్యాటింగ్ వైఫల్యం జట్టుకు ప్రతికూలంగా మారింది. కీలక ఆటగాళ్లు తమ స్థాయికి తగ్గ బ్యాటింగ్‌ను కనబరచలేక పోతున్నారు. బాబర్ ఆజమ్, సౌద్ షకిల్, కెప్టెన్ రిజ్వాన్, సల్మాన్ ఆఘా, తయ్యబ్ తాహిర్, ఖుష్‌దిల్ షా వంటి ప్రతిభావంతులైన క్రికెటర్లు జట్టులో ఉన్నారు. అయినా పాక్‌కు వరుస ఓటములు తప్పడం లేదు. ఇలాంటి స్థితిలో బంగ్లాతో పోరు పాక్‌కు సవాల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో కూడా ఓడితే విమర్శలు మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో పాక్ ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగానే ఉన్నా పాక్‌కు ఏదీ కలిసి రావడం లేదు. ఈ మ్యాచ్‌లోనైనా ఆటగాళ్లు సమష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అప్పుడే పాక్‌కు గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.



జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

## కుబేర తెలివైన ఎత్తుగడ




అక్కినేని అభిమానులు ఎప్పుడెప్పుడాని ఎదురు చూసిన కుబేర విడుదల తేదీ వచ్చేసింది. జూన్ 20 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నట్టు టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఇందులో మెయిన్ హీరో ధనుష్ అయినప్పటికీ పాత్ర పరంగా నాగార్జునకు సైతం చాలా ప్రాధాన్యం ఉండటంతో దీన్నీ మల్టీ స్టారర్ గానే పరిగణించాలి. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మనీ క్రైమ్ డ్రామాలో రష్మిక మందన్న హీరోయిన్ కాగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నాడు. కాంబినేషన్ల పరంగా ఈ సినిమాకు చాలా ప్రత్యేకతలున్నాయి.వేసవి సీజన్ ముగింపులో జూన్ చాలా కీలకం. ఇప్పటిదాకా ఏ పెద్ద సినిమా ఆ నెలను లాక్ చేసుకోలేదు. చిరంజీవి విశ్వంభరని అనుకున్నారు కానీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. షూటింగ్ పూర్తయ్యి గుమ్మడికాయ కొట్టేదాకా డేట్ ఆశించలేం. రవితేజ మాస్ జాతర సైతం ఇలాంటి మీమాంసనే ఎదురుకుంటోంది. జూన్ 5 కమల్ హాసన్ తగ్ లైఫ్ ఒక్కటే ఇప్పటిదాకా అఫీషియల్ గా అనౌన్స్ చేసుకున్న ప్యాన్ ఇండియా మూవీ. ఆ తర్వాతి వారం ఖాళీగానే ఉంది. జూన్ చివరి వారం సైతం ఎవరూ ఎంచుకోలేదు. సో కుబేర కనక పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే ఓపెనింగ్స్ తో పాటు మంచి రన్ పుష్కలంగా దక్కుతుంది. ఇంకో ఇంకో కారణం కూడా ఉంది. ధనుష్ నటించి దర్శకత్వం వహించిన ఇడ్లి కడాయ్ ఏప్రిల్ 10 రావాలి. ఒకవేళ పోస్ట్ పోన్ అయ్యే పక్షంలో మే అనుకుంటున్నారు. అదే జరిగితే తన రెండు సినిమాల మధ్య కనీసం నెల రోజుల పైన గ్యాప్ లేకపోతే థియేటర్స్ పరంగా ఇబ్బంది వస్తుందని భావించి కుబేర నిర్మాతలకు ఆ మేరకు సూచనలు చేశాడట.

## భీమ్స్ మిస్ కావడమే మైనస్సు

నిన్న విడుదలైన మజాకాకి మిశ్రమ స్పందన కనిపిస్తోంది. మరీ బ్యాడని అనడం లేదు కానీ ధమాకాని మించిన ఎంటర్ టైన్మెంట్ ఉంటుందని ఆశించిన ప్రేక్షకులకు పూర్తి సంతృప్తి కలగలేదు. పైగా ఓపెనింగ్స్ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో రాలేదని ట్రేడ్ టాక్. వీక్ డే అయినప్పటికీ శివరాత్రి సెలవుదినం కావడంతో ఆడియన్స్ బాగా వస్తారని నిర్మాతలు అంచనా వేశారు. ప్రమోషన్ల ద్వారా సరిపడా బజ్ ఏర్పడనప్పటికీ ట్రైలర్ వల్ల హైప్ వచ్చిన మాట వాస్తవమే. అయితే మిక్స్డ్ టాక్ ప్రభావం కాసేపు పక్కనపెడితే ఒక్క అంశం మజాకాకు ప్రతికూలంగా పని చేసింది. అదే భీమ్స్ సిసిరోలియోను తీసుకోకపోవడం.మాస్ మహారాజా రవితేజ ధమాకాకు భీమ్స్ ఇచ్చిన ఆల్బమ్ గొప్ప ఎనర్జీ ఇచ్చింది. మూడు పాటలు ఏకంగా రిపీట్ ఆడియన్స్ తీసుకొచ్చాయి. దండ కడియాల్, జింతాకు జిజిన, పల్సర్ బైకు ఒకదాన్ని మించి మరొకటి ఆడియో, వీడియో రెండింటి పరంగా ఓ రేంజ్ లో పేలాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలోనూ భీమ్స్ ఈ సినిమాకు బెస్ట్ ఇచ్చాడు. కానీ మజాకాలో ఇవి మిసయ్యాయి. ఏ పాటా ఛార్ట్ బస్టర్ కాలేదు. రావులమ్మా, పగిలి పగిలి కొంచెం సోషల్ మీడియాలో హడావిడి చేశాయి కానీ ఆశించిన స్థాయిలో కాదు. దానికి తోడు వీటి చిత్రీకరణ, కొరియోగ్రఫీ చెప్పుకునే స్థాయిలో లేకపోవడం ఇంప్రెషన్ తగ్గించేశాయి. మజాకాకి భీమ్స్ ని రిపీట్ చేయకపోవడానికి దర్శకుడి వైపు కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ లియోన్ జేమ్స్ నుంచి కోరుకున్న అవుట్ ఫుట్ రాలేదన్నది వాస్తవం. మ్యూజిక్ అనేది ఒక సినిమా మీద ఆసక్తి రేగడానికి ఎంత పని చేస్తుందో చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ అక్కర్లేదు. ఛావాకు లాంటి బ్లాక్ బస్టర్ కు పని చేసిన ఏఆర్ రెహమాన్ మీదే కామెంట్స్ తప్పలేదు. అలాంటిది లియోన్ జేమ్స్ మినహాయింపుగా ఎలా ఉంటాడు. సుదీర్ఘమైన వీకెండ్ ఉంది కాబట్టి మజాకా ఈలోగా ఎంత రాబట్టుకుంటుందనేది కీలకం కానుంది. ముఖ్యంగా శని ఆదివారాలు నమోదయ్యే నెంబర్లు ఫైనల్ స్టేటస్ నిర్ణయిస్తాయి.



# ఇలాంటి పాత్రల్లో మెప్పిస్తుందా?

పూజా హెగ్డే హీరోయిన్‌గా అరంగేట్రం చేసి దశాబ్దం దాటింది. కానీ ఇన్నేళ్లు గడిచినా ఆమెను ఒక గ్లామర్ హీరోయిన్‌గానే చూస్తున్నారు. ఆమె నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేసింది తక్కువ. 'అరవింద సమేత' లాంటి కొన్ని చిత్రాల్లో మాత్రమే కొంత నటనకు ప్రాధాన్యం లభించింది. అలాంటి పాత్రల్లోనూ ఆమె గ్లామరే హైలైట్ అయింది తప్ప.. నటన గురించి పెద్దగా మాట్లాడుకోలేదు. అందం కోణంలో తప్ప నటన కోసం చూడని కొద్దిమంది హీరోయిన్లలో పూజా ఒకరని చెప్పాలి. అలాంటి హీరోయిన్లను డీగ్లామరస్, పెయిన్ ఫుల్ క్యారెక్టర్లలో చూడడానికి ప్రేక్షకులు ఇష్టపడరు కూడా. గతంలో కాజల్ అగర్వాల్ కూడా ఈ కోవకే చెందేది. ఐతే పూజా కెరీర్లో తొలిసారిగా డీగ్లామరస్ రోల్ చేయబోతోందని.. ఆమెను ఒక షాకింగ్ క్యారెక్టర్లో రాఘవ లారెన్స్ చూపించబోతున్నాడని వార్తలు వస్తున్నాయి. కాంఛన సిరీస్‌లో నాలుగో సినిమా తీయడానికి రాఘవ లారెన్స్ రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డేను కథానాయికగా ఎంచుకున్నాడు. ఆమె ఈ సినిమాలో చెవిటి-మూగ అమ్మాయిగా కనిపించబోతోందనే వార్త ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పూజా లాంటి గ్లామర్ హీరోయిన్ ఇలాంటి పాత్ర చేయడం ఏంటి అని తన ఫ్యాన్స్ అవాక్కవుతున్నారు. ఇంతకుముందు 'గంగ' (కాంఛన-3)లో సినిమాలో నిత్యా మీనన్‌ను దివ్యాంగురాలిగా చూపిస్తే బాగానే కుదిరింది. బేసిగ్గా నిత్య పెర్ఫామర్ కావడం వల్ల ఆ పాత్ర పండింది. కానీ పూజాను



చెవిటి-మూగ అమ్మాయిగా చూపిస్తే తన ఫ్యాన్స్ తట్టుకోగలరా అన్నది సందేహం. నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో చేసి తామేంటో నిరూపించుకోవాలని అందరు హీరోయిన్లకూ ఉంటుంది కానీ.. పూజా మాత్రం ఇలాంటి పాత్రకు మిస్ ఫిట్ ఏమో అనే సందేహాలు కలుగుతున్నాయి.


## మార్చి 1న 'కన్నప్ప' టీజర్ విడుదల

ప్రతిష్టాత్మక మైథలాజికల్ చిత్రం 'కన్నప్ప' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు సృష్టించింది. మంచు విష్ణు హీరోగా నటిస్తున్న ఈ సినిమాను బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తుండగా ఈ చిత్రాన్ని పాన్ ఇండియా చిత్రంగా భారీ బడ్జెట్‌తో డా.ఎం.మోహన్ బాబు నిర్మిస్తున్నారు. పలు ఇండస్ట్రీలకు చెందిన నటులు ఈ మూవీలో నటిస్తుండటంతో సౌత్‌తో పాటు నార్త్‌లోనూ ఈ మూవీ విడుదల కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని 'కన్నప్ప' చిత్ర బృందం శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని సందర్శించింది. ఈ సినిమా టీజర్‌ను అక్కడ ప్రదర్శించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ మంచు విష్ణు సంతోషాన్ని వ్యక్తం చేశారు. "మార్చి 1న ఈ సినిమా టీజర్ విడుదలవుతుంది. గురువారం ముంబయ్‌లో మీడియాతో సమావేశం కానున్నాం. అందరికంటే ముందుగా వారు 'కన్నప్ప' టీజర్‌ను చూస్తారు"అని మంచు విష్ణు తెలియజేశారు. ఇక ఈ కార్యక్రమంలో మోహన్‌బాబు, ప్రభుదేవా, శివ బాలాజీ, రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాలో మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి స్టార్స్ పలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను వేసవి కానుకగా ఏప్రిల్ 25న గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.



## విడాకుల వార్తలపై ఆది రెస్పాన్స్

ఇటీవలే ఫిలిం సెలబ్రెటీల విడాకుల వార్తలు తరచుగా వింటున్నాం. గతంలో బాలీవుడ్లో మాత్రమే ఈ వార్తలు ఎక్కువగా వినిపించేవి. కానీ ఈ మధ్య దక్షిణాదిన కూడా ఈ ఒరవడి పెరిగింది. గత కొన్నేళ్లలో నాగచైతన్య-సమంత, ధనుష్-ఐశ్వర్య, జయం రవి-ఆర్తి, ఇలా చాలా జంటలు విడిపోయాయి. ఈ నేపథ్యంలో ఇంకేదైనా జంట విడాకులు తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తే జనాలు ఆశ్చర్యపోవట్లేదు. ఇది నిజమా అని అనుమానపడట్లేదు. దీంతో కలిసి ఉన్న జంటలు కూడా ఈ పుకార్లతో ఇబ్బందులు పడుతున్నాయి. సూర్య-జ్యోతిక గురించి ఆ మధ్య ఇలాగే రూమర్లు వినిపించాయి. కానీ ఆ జంట అన్యోన్యంగా ఉన్న సంగతి తర్వాత వెల్లడైంది. ఇప్పుడు తమిళంలో హీరోగా సెటిలైన తెలుగు కుర్రాడు ఆది పినిశెట్టి వైవాహిక జీవితం గురించి సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం వారి కుటుంబానికి ఇబ్బందిగా మారింది. ఆది.. కొన్నేళ్ల కిందట తన కోస్టార్ నిక్కి గల్రానిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ జంట విడిపోతున్నట్లుగా ప్రచారం జరిగింది. దీనిపై తాజాగా ఆది స్పందించాడు. తాము విడిపోవట్లేదని, సంతోషంగా ఉన్నామని ఆది క్లారిటీ ఇచ్చాడు. "నిక్కీ మొదట్నుంచి నాకు మంచి ఫ్రెండ్. నా కుటుంబ సభ్యులకు కూడా ఆమె బాగా దగ్గరైంది. మా ఇంట్లో వాళ్లు తనకు బాగా నచ్చారు. ఆమె ఉంటే నేను సంతోషంగా ఉంటాననిపించింది. దీంతో పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. సంతోషంగా జీవిస్తున్నాం. కానీ మేం విడాకులు తీసుకుంటున్నట్లు యూట్యూబ్‌లు స్టోరీలు కనిపించాయి. మొదట వాటిని చూసి షాకయ్యా, చాలా కోపం వచ్చింది. కానీ ఆ ఛానెళ్లలో పాత వీడియోలు చూస్తే వాళ్ల వ్యవహారం అర్థమైంది. ఇలాంటి వాళ్లను పట్టించుకోవడం వృథా అనిపించింది. క్లిక్స్ కోసం ఎంతకైనా తెగిస్తారని అర్థమైంది" అని ఆది తెలిపాడు. ఆది హీరోగా నటించిన 'శబ్దం' ఈ శుక్రవారమే ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.



## తెలుగు ఛావాకు కనెక్ట్ అవుతారా!

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సునామిలా విరుచుకుపడిన చావా ఇప్పటికే మూడు వందల కోట్ల మార్కుని దాటేసి అయిదు వందల వైపు పరుగులు పెడుతోంది. ఇంకో వారంలోపే ఆ లాంఛనం పూర్తయ్యేలా ఉంది. అయితే దీని డబ్బింగ్ వెర్షన్ల కోసం ప్రేక్షకుల నుంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఇప్పటిదాకా ఆ దిశగా నిర్మాణ సంస్థ చొరవ తీసుకోకపోవడం అసంతృప్తిని కలిగించింది. ఫైనల్ గా వాళ్ళ కోరికను తీరుస్తూ మార్చి 7 తెలుగు డబ్బింగ్ ని గీతా ఆర్ట్స్ ద్వారా రిలీజ్ చేయబోతున్నట్టు సమాచారం. గతంలో కాంతారని పంపిణి చేసింది ఈ సంస్థే. కాబట్టి థియేటర్ కౌంట్ పరంగా మంచి నెంబర్ దక్కబోతోంది.మూడో వారంలో అనువాదమంటే వసూళ్లు మరీ భారీగా ఆశించలేం కానీ ఆడియన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి. ఎందుకంటే గతంలో ఇలాంటి హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన టాలీవుడ్ స్ట్రెయిట్ సినిమాలు సైరా, గౌతమిపుత్ర శాతకర్ణి, రుద్రమదేవి లాంటివి విజయం సాధించాయి కానీ రికార్డులు బద్దలు కొట్టే స్థాయిలో కాదు. పైగా అవి తెలుగు వీరుల గాథలే అయినా మన పబ్లిక్ కి అంతగా ఎక్కలేదు. మరి మరాఠా వీరుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ కథని చూస్తారా అంటే చెప్పలేం. ఇప్పటికే ఒరిజినల్ వెర్షన్ తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఆడింది. కీలక కేంద్రాల్లో పెద్ద ఎత్తున కలెక్షన్లు వచ్చాయి. చావా తెలుగు వెర్షన్ కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. సోషల్ మీడియాలో జూనియర్ ఎన్టీఆర్ డబ్బింగ్ చెబుతాడనే పుకారు పుట్టినది కానీ అందులో ఏ మాత్రం నిజం లేదు. కాకపోతే రష్మిక మందన్న స్వంతంగా చెప్పుకుంటుందో లేదో చూడాలి.

